ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21 | సంచిక : 6 | ఫిబ్రవరి 2016

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
21-12-2015,
22-12-2015 &
23-12-2015
అరుణాచలం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-12-2015 అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు గీతాజయంతి. భగవంతుడి చేత గానం చేయబడినది భగవద్గీత. ఇక్కడ చెప్పినవాడు వాసుదేవస్వామి, విన్నవాడు అర్జునుడు, వ్రాసినవాడు వ్యాసుడు. ఒక జీవితంలో నాలుగు వేదాలు అధ్యయనం చేయటం కష్టం. అందుచేత నాలుగు వేదాలసారాన్ని తీసి 700 శ్లోకాలలో పరమాత్మ భగవద్గీతను చెప్పాడు. మహాభారతం మనకు రెండు ప్రసాదాలను తీసుకొనివచ్చింది 1. భగవద్గీత, 2. విష్ణుసహస్ర నామాలు. ఇందులో భగవద్గీతను స్వయంగా భగవంతుడే చెప్పాడు. విష్ణుసహస్రనామాలను భగవంతుడి సమక్షంలో భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు. భగవద్గీతను పరమాత్మ మూడు భాగాలుగా విభజించాడు. మొదటి ఆరు అధ్యాయాలు కర్మకు ప్రాముఖ్యత ఇచ్చాడు. రెండో ఆరు అధ్యాయాలు భక్తికి అంటే శరణాగతికి ప్రాముఖ్యత ఇచ్చాడు. మూడో ఆరు అధ్యాయాలు జ్ఞానానికి ప్రాముఖ్యత ఇచ్చాడు. మొదటి 17 అధ్యాయాల సారాన్ని తీసుకొనివచ్చి పరమాత్మ 18వ అధ్యాయంలో చెప్పాడు. పుస్తకానికి ఎక్కడా భక్తులు ఉండరు కాని కేవలం భగవద్గీతకు చాలామంది భక్తులు ఉన్నారు.

ఒకసారి భగవాన్‌తో కొంతమంది భక్తులు ఏమండీ అప్పడప్పడు భగవద్గీత చదువుతూ ఉంటాము అని చెపితే అప్పడప్పడు చదువుతాము అంటారు ఏమిటి? అది నిరంతరం చదవవదగిన గ్రంథమే అది ఒక

మానవుడి యొక్క మెదడులో నుండి వచ్చిందికాదు, మనలో అంతర్యామిగా ఉన్న, ఈ సృష్టికంతకు ఆధారంగా ఉన్న పరమాత్మచేత చెప్పబడిన గ్రంథం. అందుచేత గీతను అప్పుడప్పుడు చదవటంకాదు, మీకు అవకాశం ఉంటే ఎప్పుడూ చదవటం మంచిది అని భగవాన్ చెప్పారు. కర్మఫలాన్ని త్యాగం చేయమని గీత పొడుగునా చెపుతూ, మరల చివరలో ఈ అధ్యాయం చదివితే ఈ పుణ్యం వస్తుంది అని పరమాత్మ చెప్పటం ఏమిటి? ఇది ముందు ఆయన చెప్పిన మాటలకు విరుద్ధంగా కనిపిస్తోంది కదా అని కొంతమంది నన్ను అడిగారు - భగవద్గీతలో భగవంతుడు చెప్పింది సత్యం. మన పిల్లలు ఎప్పుడైనా బడికి వెళ్ళటానికి తగువు పెడితే వారికి బిస్కట్లు ఇస్తాము లేకపోతే పదిపైసలు ఇచ్చి బఠాణీలు కొనుక్కోమంటాము. ఇదంతా వాడికి బిస్కట్లు పెట్టటం కోసం కాదు, బఠాణీలు ఇవ్వటం కోసం కాదు, వాడిని బడికి పంపటంకోసం ఇవి అన్నీ మనం చేస్తున్నాము. అంటే మన బ్రెయిన్‌కు మెచ్యూరిటీ లేనప్పుడు, మీకు ఈ కోరికలు నెరవేరతాయి, ఆ పుణ్యం వస్తుంది అని ఇలా మీకు ఏదో కొంత ఆకర్షణ చూపించి మీచేత భగవద్గీత చదివించటానికే ఆ మాటలు చెప్పాడు కాని అది ఫైనల్ కాదు. కొంతమంది భౌతికవిషయాలే కోరుకొంటారు. అవి నెరవేరిన తరువాత భక్తులు అయినవారు చాలామంది ఉన్నారు. అందుచేత మీరు భౌతిక విషయాలు కోరుకొన్నా పరమాత్మది చాలా విశాలమైన హృదయం. ఎల్‌కెజి మొదలు డాక్టరేట్ తీసుకున్నవాళ్ళ వరకు అందరికీ ఆయన హృదయంలో స్థానం ఇచ్చాడు. ఆయన హృదయంలో స్థానం ఇవ్వకుండా ఎవరినీ, ఏ జీవుడినీ విడిచిపెట్టలేదు. మీరు ఎటువంటి పరిస్థితులలో ఉన్నప్పటికీ, ఎన్ని కష్టాలలో ఉన్నప్పటికీ, మీరు ఏదైనా అశాంతితో బాధపడుతున్నప్పటికీ గీతలో ఏదో శ్లోకం మీ కంటి నీటిని తుడుస్తుంది, మిమ్మల్ని ఊరడిస్తుంది. ఇది భగవద్గీతలో ఉన్న గొప్ప విషయం. ఇది మీరు జ్ఞాపకం పెట్టుకోండి.

మాటలో ఏముంది అనుకోకండి, మాట జాగ్రత్తగా మాట్లాడాలి. పదిసార్లు ఆలోచించి ఒకసారి మాట్లాడాలి. ఆ మాటలు మీకు ఉపయోగపడాలి, సమాజానికి ఉపయోగపడాలి. మాట నిర్మలంగా ఉండాలి. ఇతరులను ఉద్రేకపరచకూడదు. ఎవరైనా ఏదైనా చెపుతూ ఉంటే వారు చెప్పేది విన్న తరువాత మీరు చెప్పాలి, అడ్డువెళ్ళకూడదు. నువ్వు ఇతరులకు ఏదైనా చెప్పేటప్పుడు అక్కడ నీ పాండిత్యం చూపించటంకాదు, వారికి అర్థమయ్యేలాగ చెప్పాలి,

వారి స్థాయికి దిగి చెప్పాలి. ఇప్పుడు నేను ఏదైనా మీకు చెపుతూ ఉంటే అది మీకు అర్థం కాకపోతే నాది పొరపాటు కాని మీది పొరపాటు కాదు ఎందుచేతనంటే మీ స్థాయికి దిగి వచ్చి నేను టీచ్ చేయలేకపోతున్నాను. ఇప్పుడు మన దేశంలో కులాభిమానం పెరుగుతోంది. ఇక్కడ అన్ని కులాలవారు ఉన్నారు. హిందూమతం ఉన్నంతకాలం ఈ కులాలు ఉంటాయి. ఒకవేళ మీ కులం మీద అభిమానం ఉన్నా, మీ కులానికి మీరు ఎంతోకొంత సహకారం చేసినా, మీ కులం సమాజానికి ఉపయోగపడేలా చెయ్యాలి. అంటే కులం మటుకు ఆ కులానికే కాకుండా మొత్తం సమాజానికి సహకరించేలాగ ఉండాలి. అది నా అభిప్రాయం.

ప్రపంచంలో నీకు సంతోషం కలిగించే సంఘటనలు రావచ్చు, మీకు దండలు వేయవచ్చు, మిమ్మల్ని ఊరేగించవచ్చు. మీకు ఏదైనా విషయంలో జయం రావచ్చు. జయం వస్తే మీకు సంతోషం రావచ్చు. ఇక్కడ భగవంతుడు చెప్పే రహస్యం ఏమిటి అంటే బయట నుండి మీకు సంతోషం పొందే అవకాశాలు వచ్చినా కాని సంతోషించకండి. ఏదైనా బయట కారణాల వలన మీరు సంతోషిస్తే ఈనాటికైనా, ఏనాటికైనా మీ సంతోషం అంతా దుఃఖంగా మారిపోవును. మీ నిల్వ అంతా అప్పుకింద మారిపోవును. అందుచేత న్యూట్రల్‌గా ఉండండి, బ్రయిన్‌ను ఎప్పటికప్పుడు బేలెన్స్ చేసుకోండి. మీకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నా కూడా బయటనుండి ప్లెజర్స్ తీసుకోవద్దు అంటున్నాడు. సమాజంలో ఆర్థికంగా గాని, తెలివిలోకాని, సాంఘికంగాగాని, రాజకీయంగాగాని, మిగతా పరిస్థితులలో కాని మీకంటే ఉన్నతులు ఉంటే వారిని చూసి ద్వేషించకండి. మీకు ద్వేషభావన వద్దు. మీరు ఏ రంగంలో అయినా అభివృద్ధిలోనికి వస్తూఉంటే మీ కుటుంబంలోనే ముందు ద్వేషం ప్రారంభ మవుతుంది. ఎందుచేతనంటే ద్వేషానికి పెట్టుబడి అక్కరలేదు. నీకంటే ఉన్నత స్థితిలో ఉన్నవారిని చూసిన వారిమీద ద్వేషం వద్దు. మాలో పవిత్రత లేనప్పుడు, ప్రేమ లేనప్పుడు సబ్జక్టు చెప్పటానికి కూడా మేము సరిపోము. పవిత్రతలో నుండే, ప్రేమలో నుండే అనుగ్రహం ప్రవహిస్తుంది. రామకృష్ణుడు అనుగ్రహస్వరూపుడు, భగవాన్ అనుగ్రహస్వరూపుడు అంటే అక్కడ లోపల పవిత్రత, యూనివర్సల్ లవ్ ఉన్నాయి కాబట్టే అక్కడ నుండి అనుగ్రహం వస్తోంది కాని లోపల ప్యూరిటీ లేనప్పుడు, యూనివర్సల్ లవ్ లేనప్పుడు అక్కడ గ్రేస్ ఎక్స్‌ప్రెస్ కాదు. చెప్పండి, చెప్పండి అంటున్నారు కాని మాటల్లో ఏమీలేదు, అంతా సైలెన్స్‌లోనే ఉంది.

మౌనంలో నుండే అనుగ్రహం ప్రవహిస్తుంది. నా హృదయంలో ఏముందో అది నా మాటల్లో ఎక్స్‌ప్రెస్ అవ్వకపోతే అది మీకు ఉపయోగపడదు. నేను మౌనంగానే ఉంటున్నాను. ఎక్కువ మాట్లాడను. నాకు వాసనాక్షయం అవ్వటం లేదు ఏమిటి అని ఒక బ్యాంక్ ఆఫీసర్‌గారు అడుగుతున్నారు. మౌనం అంటే మీరు నోరుమూసుకుని కూర్చుంటున్నారు. అది మంచిదేకాని వాసనాక్షయం అవ్వటానికి అది సరిపోదు, మనస్సు అణగాలి. ఈ వాసనలు సటిల్‌బాడీలో ఉంటాయి. వాసన ఎక్కడ ఉందో అది కాలిపోతే కాని మీకు వాసనలుపోయే అవకాశం లేదు. ముందు మనస్సు అణగాలి, అణిగిన తరువాత అది పల్చబడి చిరిగిపోవాలి.

కొంతమంది ప్రతీ చిన్నవిషయానికి దుఃఖపడతారు. అలాకాదు, నీ కుటుంబ పరిస్థితులు, బాహ్యపరిస్థితులు ఎలా ఉన్నా, నిన్ను ఎటువంటి పరిస్థితులలో ఇరుకున పెట్టినా నువ్వు దుఃఖపడవద్దు. అయ్యో నేను వీళ్లని దుఃఖపడే పరిస్థితులలో పెట్టాను, అయినప్పటికీ వారి మొఖంలో ఎక్కడా దుఃఖస్పర్శలేదు అని భగవంతుడి అనుగ్రహం అప్పుడు మీ శిరస్సు మీద కురుస్తుంది. నీ శాంతిని పాడుచేసే కారణాలు బయట ఉన్నప్పటికీ ఆ కారణాల యొక్క ప్రభావం నీ శిరస్సుమీద పడకుండా నువ్వు శాంతిగా ఉండగలిగితే అప్పుడు మాయ నీకు దారి ఇస్తుంది. మాయ మనకు దారి ఇస్తే ప్రయాణం చెయ్యగలము కాని లేకపోతే ఎక్కడికి వెళతాము. అందుచేత ఎట్టి పరిస్థితులలోను నువ్వు దుఃఖపడవద్దు. బుద్ధుడు భార్యను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. బుద్ధుడు వెళ్ళిపోయాడు అనే భావన లేకుండా ఆవిడ చాలా కూల్‌గా, క్వయిట్‌గా ఉంది. తులసీదాసు భార్య కూడా అలాగే జీవించింది. భర్త ఉన్నప్పుడు ఎలా ఉన్నారో, లేనప్పుడు కూడా అంత శాంతిగా ఉన్నారు. అలా మీరు ఉండగలరా? అలా ఉండగలిగితే మీరు భగవంతుడి అనుగ్రహానికి డిజర్వు అవుతారు. అందరికీ కోరికలు ఉంటాయి. అసలు మీకు కోరిక అక్కరలేదు. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. మీ దేహప్రారబ్ధంలో ఏది జరగాలో అది జరుగుతూ ఉంటుంది. కాని మీరు ఏమి అనుకొంటున్నారు అంటే కోరిక ఉంటే జరుగుతుంది, కోరిక లేకపోతే అది జరుగదు అనుకొంటున్నారు. మీ ప్రారబ్ధంలో ధనవంతులు అయిపోవాలని ఉంది అనుకోండి, మీరు ధనవంతులు అయిపోతారు. మీకు ధనవంతులు అవ్వాలని కోరిక ఉన్నా మీ ప్రారబ్ధంలో లేకపోతే ధనవంతులు అవ్వలేరు. అయితే మన దగ్గర ఉన్న బలహీనత ఏమిటి అంటే కోరిక

లేకపోతే పని అవ్వదేమో అనుకుంటాము. ఈశ్వరుడికి శక్తి ఉంది కాని కోరికకు శక్తి లేదు. ఇక్కడ భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే నీ ప్రారబ్ధాన్ని బట్టి, నీ అర్హతను బట్టి నీకు వచ్చేది ఏదో వస్తుంది కాని నీ కోరికవల్ల ఎక్కువ వచ్చేయదు. అందుచేత కోరికలు వద్దు. మీకు సినిమా చూడాలనే తలంపు వస్తుంది. దానిని సాటిస్ఫై చేస్తే అది పెరిగిపోతుంది. అలా కాకుండా దానిని కొద్దిగా కంట్రోల్ చేస్తే అది అణిగిపోతుంది. ఆ విషయమే కాదు తిండి దగ్గర కూడా మన శరీరానికి ఇది చెడ్డ అనుకొన్నప్పుడు మానేయటం మంచిది. ఎందుచేతనంటే మన శారీరకఆరోగ్యం బాగుండాలి. మన శరీరం మనకు సహకరించాలి. మన మనస్సు మనకు సహకరించాలి. అవి సహకరించకుండా మనం సత్యానుభవం పొందలేము. మీకు శరీరం ఉంది, మనస్సు ఉంది, తెలివితేటలు ఉన్నాయి. ఈ మూడు మనకు తెలుస్తున్నాయి. నీలో అంతర్యామిగా ఉన్న నారాయణుడిని రిలైజ్ చెయ్యటానికి ఈ మూడింటిని మేగ్జిమమ్ ఉపయోగించుకోండి. అలా నారాయణుడిని తెలుసుకోవటానికి ఉపయోగించుకోకుండా ఏవో లోకానికి సంబంధించిన విషయాలకు ఉపయోగించుకొని భౌతికంగా ఏదైనా గొప్ప గొప్ప విషయాలను సాధించినా అదంతా స్వప్న సమానమే, అది స్టుపిడ్‌స్టఫ్ అంటున్నారు.

మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా ప్రతీ ఇంట్లో శుభం వస్తుంది, అశుభం వస్తుంది. శుభాలు వచ్చినప్పుడు ఒకరకంగాను, అశుభాలు వచ్చినప్పుడు ఒకరకంగాను ఉండకు. నీ బ్రెయిన్‌ను బేలెన్స్ చేసుకో. శుభాలు వచ్చినప్పుడు, అశుభాలు వచ్చినప్పుడు నీ బ్రెయిన్‌ను బేలెన్స్ చేసుకొంటూ నువ్వు సమానంగా ఉండగలిగితే ఎప్పుడో శరీరం చనిపోయిన తరువాత కాదు, ఈ శరీరం ఉండగానే ఇప్పుడే నీకు ఈశ్వరుని స్ఫురణ తెలుస్తుంది. అంటే చర్మాన్ని ముట్టుకుంటే ఆ స్పర్శ నీకు ఎలా తెలుస్తుందో, అంత స్పష్టంగా, అంత ఫిజికల్‌గా ఈశ్వరుని ప్రెజన్స్ నీకు తెలుస్తుంది. మిమ్మల్ని కొంతమంది గౌరవిస్తారు, కొంతమంది అగౌరవపరుస్తారు. ఈ ద్వంద్వాలు సహజం. ఇది ప్రకృతి. ఈ ప్రపంచం గొడవలలోనికి ఎక్కువగా వెళ్ళకుండా మీ పనులేవో మీరు చూసుకోండి. ఈ ప్రపంచం క్రూయల్‌గా ఉంటుంది. మీకు ఏదైనా కష్టం వస్తే మిమ్మల్ని ఓదార్చేవారు ఉండరు, మిమ్మల్ని నీడకు రమ్మనేవారు ఉండరు, మీ నెత్తిమీద బెడ్డలు వేస్తారు. ప్రపంచం యొక్క స్వభావం అది, ఆ గొడవ వదిలెయ్యి. ప్రకృతి

మొట్టే మొట్టికాయలు కూడా నిన్ను బలం చేయటానికే. ఆ మొట్టికాయలను తట్టుకొంటే నీకు స్పిరిట్యువల్ స్టేటస్ వస్తుంది.

బుద్ధుడు, రమణమహర్షి గారి ప్లాన్ ఏమిటి అంటే దుఃఖస్పర్శ ఎలా ఉంటుందో తెలియని స్థితికి మిమ్మల్ని తీసుకొనిపోవటానికి ప్రయత్నం చేసారు. మీ కులాలతోటి, మతాలతోటి, ఆస్తులతోటి, తెలివితేటలతోటి ఏమీ సంబంధం లేదు. ఒకవేళ భగవంతుడు వచ్చి మీకు స్వర్గం ఇస్తాను అంటే మాకు అవసరం లేదు అని చెపుతారు అటువంటి స్థితికి మిమ్మల్ని తీసుకొనిపోవటానికే వారి ప్రయత్నం. అంటే ఈ లోకాలతోటి అవసరం లేకుండా మీ అంతట మిమ్మల్ని స్వతంత్రంగా 100% హేపీనెస్‌లో ఉంచటానికి ఒక ప్రయత్నం చేసాడు బుద్దుడు. ఇందులో మధ్యవర్తులతోటి సంబంధంలేదు. మీరు ఏదో చెప్పకుపోతున్నారు, మిమ్మల్ని ఫాలో అవ్వటం కష్టంగా ఉంది అని అంటే రిమంబర్ మి, నన్ను జ్ఞాపకం పెట్టుకో అది సరిపోతుంది అని అన్నాడు బుద్ధుడు. చేసింది ఊరికేపోదు. నువ్వు ఎప్పడైనా మంచి పని చేసావా, కనీసం మనస్సులో ఎవరి క్షేమం అయినా నువ్వు కోరావా? ఆ మాత్రం చేస్తే తరువాత నీకు హయ్యర్ బర్త్ ప్రసాదిస్తాను అంటున్నాడు పరమాత్మ. ఈ జీవులందరి హృదయాలలో ఉండి శరీరాలనే యంత్రాలను తిప్పతున్నాను. అది వారికి అవగాహన కావటంలేదు. నువ్వు పెద్దగా కష్టపడనక్కరలేదు. నీకు తెలుసున్నా, తెలియకపోయినా నీ హృదయంలో నేను అంతర్యామిగా ఉన్నాను. నన్ను శరణాగతి చేస్తే నిన్ను మాయలోనుండి విడిపిస్తాను. నా అనుగ్రహం లేకుండా మాయలో నుండి నువ్వు విడుదల పొందలేవు. నన్ను శరణాగతి చెయ్యి అంటున్నాడు పరమాత్మ.

భగవద్గీతకు రామానుజుడు, మద్వాచార్యులు, శంకరాచార్యులవారు, ఇంకా చాలా మంది మేథావులు వ్యాఖ్యానాలు వ్రాసారు. భగవద్గీత చిన్న పుస్తకం మీ జేబులో ఉంటే నాలుగు వేదాలు మీ జేబులో ఉన్నట్లే. గీతలో ద్వైతానికి, అద్వైతానికి, విశిష్టాద్వైతానికి సరిపడ శ్లోకాలు ఉన్నాయి. పరమాత్మ అన్నీ సమన్వయం చేసాడు. నువ్వు ఆపరేషన్ చేయించుకోవటానికి డాక్టరు దగ్గరకు వెళితే నీకు రక్తం సరిపడ ఉందో లేదో చూస్తాడు. రక్తం తక్కువగా ఉంటే ఇప్పడు చెయ్యవద్దు ఇంకా కొంచెం రక్తం పట్టాలి తరువాత చేద్దాము

అంటాడు. అలా రోగిని ఆపరేషన్‌కోసం రెడీ చేస్తాడు. అలాగే భగవంతుడు మానవుడి పరిణామక్రమం చూస్తూ ఉంటాడు. వాడి మానసికస్థితి ఎలా ఉంది? వాడు చైతన్య స్థాయి ఏ స్థాయిలో ఉన్నాడు అన్నీ జాగ్రత్తగా చూస్తూ ఒక మెట్టు మీద నుండి ఇంకో మెట్టుమీదకు స్టెప్ బై స్టెప్ జాగ్రత్తగా మిమ్మల్ని తీసుకొని వెళతాడు. మిమ్మల్ని వదిలివేయడు, నేను ఉన్నాను కదా అని సపోర్టు ఇస్తూ ఉంటాడు. నువ్వు భయపడకు, నువ్వు చేసేది జాగ్రత్తగా చేసుకో. నా దయ ఉంటుంది కదా అని సపోర్టు ఇస్తాడు. నువ్వు పుష్పాలతో చేసేదే పూజకాదు, నువ్వు చేతులతో చేసే పని కూడా భగవంతునికి పూజగా అర్పించు. పుష్పాలను దేవుని పాదల దగ్గర ఎలా పెడతున్నావో అలాగ నీ మాటలను, నువ్వు చేసే పనులను, నీ ఆలోచనలను, నీ సంకల్పాలను అన్నింటినీ కూడా ఈశ్వరునికి సమర్పించు. అప్పుడు ఆయన అనుగ్రహానికి పాత్రుడవు అవుతావు. ఎప్పుడోకాదు నువ్వు ఈ జన్మలోనే ఇక్కడే తరిస్తావు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-12-2015 అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇప్పుడు మీరందరూ అరుణాచలం వచ్చారు. ఇక్కడ మీరు చేయవలసింది ఏమిటి అంటే కొండ బాగా కనిపించేలాగ కూర్చుని ఆ కొండను ఎంతసేపు చూడగలిగితే అంతసేపు చూడండి. తరువాత రమణాశ్రమానికివెళ్ళి కొంతసేపు ధ్యానం చేసుకోవచ్చు. పెద్దగుడికి వెళితే అక్కడ కూడా ధ్యానం చేసుకోవచ్చు. ఇక్కడ మొట్టమొదట ఇంపార్టెన్స్ ఈ కొండకే. మీకు ఏమైనా కోరికలు ఉంటే కోరుకోండి, అవి నెరవేరతాయి. కోరికలతో నన్ను భజించినా వారు కూడా భక్తులే అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఇక్కడ భగవాన్ చెప్పిన సీక్రెట్ ఏమిటి అంటే మీరు కోరికల జోలికి వెళ్ళకండి. మీరు గిరిప్రదక్షిణ చేసేటప్పుడు ప్రక్కన ఉన్న వారితో మాట్లాడకూడదు, ఆ గిరినే స్మరించుకుంటూ తిరగాలి. అంటే ఇంటి దగ్గర గొడవలు, లోకంలో గొడవలు ఒకరితో ఒకరు మాట్లాడుకొంటూ గిరిప్రదక్షిణ చేయకూడదు. మీకు అక్షరమణమాల బాగా వస్తే అది పాడుకోవచ్చు. అలా చేయటం వలన మీకు అన్ని కోరికలు నెరవేరతాయి, మోక్షం కూడా వస్తుంది. కోరిక ఉన్నవాడికి ఆ కోరిక ఒకటే నెరవేరుతుంది.

కోరిక లేనివాడికి అన్నీ నెరవేరతాయి, మోక్షం కూడా వస్తుంది అని భగవాన్ చెప్పారు.

సముద్రంలో ఎంత నీరు ఉందో నీకు అన్ని సంతోషాలు రావచ్చు లేకపోతే అన్ని కష్టాలు రావచ్చు. సముద్రంలో కెరటాలు వచ్చినట్లే నీకు తలంపుల రూపంలో సంతోషాలు రావచ్చు లేకపోతే దుఃఖాలు రావచ్చు. అప్పుడు కూడా నీ బ్రెయిన్ చెదరకూడదు, స్టడీగా ఉండాలి. ఆ స్టడీనెస్ నీకు రావటం కోసమే వాటిని భగవంతుడు పంపిస్తాడు. అవి మీకు వస్తున్నాయని భగవంతుడికి తెలుసు కదా! ఇంక నువ్వు కంగారుపడతావు ఎందుకు? నేను ఎప్పడైనా భగవాన్ గురించి మీకు కొన్ని మాటలు చెపుతున్నాను. అదే సాధన. అంతకంటే నేను చేసింది ఏమీ లేదు. నేను చేసినదానికంటే ఆయన ఇచ్చిందే ఎక్కువ. వీడు ఎలాగు చేయలేడు ఏవో కబుర్లు చెపుతున్నాడు కదా అని ఆయనే ఇచ్చేస్తాడు. మనం పెద్ద పెద్ద సాధనలు ఎక్కడ చేయగలము. పైగా ఇంకోటి అనుకొంటాము, ఆయన ఏమి చేసాడు అని ఆయనకు వచ్చింది అంటాము. అది తప్పు, గురువును అలా అనుకోకూడదు, మీరు మానేయవద్దు, మీ పద్ధతిలో మీరు చేసుకోండి.

ఎన్నిసార్లు ఆ శరీరాన్ని అలా ముక్కలు చేస్తారు, ఆ శరీరాన్ని పోనివ్వండి. ఆయన ఎక్కడికి పోతాడు, శరీరం ఉన్నప్పడు ఎలా ఉంటాడో, శరీరం లేనప్పడు అలాగే ఆయన ఉంటాడు. రోజూ ఆపరేషన్లు ఏమిటి? ఆ శరీరాన్ని ఎందుకు అంత బాధపెడతారు. శరీరాన్ని పోనివ్వండి, ఆయన ఉంటాడు కదా అని కేకలు పెట్టేవాడట చాడ్విక్. ఆ శరీరం కనబడదు అంతే కదా! ఆ శరీరాన్ని అలా పెట్టుకొని హింస పెట్టేబదులు దానిని పోనివ్వండి. ఆయన ఉంటాడు కదా, ఆయన ఎక్కడికి పోతాడు, ఆయన ఎగ్జిస్టెన్స్‌కి భంగం లేదు అనేవాడు. చాడ్విక్ పూర్వజన్మలో భగవాన్ తండ్రి అని చెపుతారు. భగవాన్ శరీరం పోయాక లండన్ వెళ్ళిపోవటానికి ఫ్లైట్ టిక్కెట్ కొనుక్కొన్నాడు, లగేజి సర్దుకున్నాడు, ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళిపోయాడు. ఫ్లైట్ ఎక్కటానికి ఇంకా 2,3 గంటలు టైమ్ ఉంది. అప్పుడు ఎక్కడికి వెళ్ళిపోతున్నావు అనే ప్రశ్న వచ్చింది. ఎప్పడో 1934లో తిరువణ్ణామలై వచ్చాడు. 16 సంవత్సరాలు భగవాన్ దగ్గర ఉన్నాడు. ఇప్పడు తిరువణ్ణామలై విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాడు. ఎందుకు వెళ్ళిపోతున్నావు, భగవాన్ లేరని వెళ్ళిపోతున్నావా? ఇప్పడు లండన్‌లో నీకు పని

ఏముంది? ఎక్కడికి వెళ్ళిపోతున్నావు, ఈ 16 సంవత్సరాల అనుభవం ఏమైంది అనే ప్రశ్న ఆయన హృదయంలోనుండి వచ్చింది. దానికి సమాధానం దొరకటంలేదు. లాస్ట్ మినిట్‌లో టికెట్ క్యాన్సిల్ చేసుకొని తిరిగి తిరువణ్ణామలై వచ్చేసాడు. మరల ఎక్కడికీ వెళ్ళలేదు. కాని ఆయనకు అనారోగ్యం వచ్చాక రాయవెల్లూరు తీసుకొనివెళితే అక్కడ చనిపోయాడు. అంటే అరుణాచలంలో వాడికి మరణంలేదు. ఆయన సమాధి రమణాశ్రమం ప్రెమిసెస్‌లో ఉంది. చాడ్విక్ ఒకసారి వాడి కుటీరంలో ఉయ్యాలలో కూర్చుని ఊగుతున్నాడు. భగవాన్ కూడా ఉన్నవాడు ఏమన్నాడు అంటే వాడు చూడండి, బల్ల మీద ఎలా ఊగుతున్నాడో, ఇలాగే ఈ దొరలందరూ అవసరాలు పెంచుకొంటారు, అవసరాలు పెరిగే కొలది డబ్బు ఎక్కువ కావాలి, ఈ దొరలందరూ అలాగే ఉంటారు అన్నాడు. అప్పుడు చాడ్విక్ ఊగుతున్నాడు భగవాన్ అలా చూసారు కాని ఏమీ కామెంట్ చేయలేదు. కొంతదూరం వెళ్ళిపోయాక భగవాన్ నెమ్మదిగా ఏమన్నారు అంటే వాడు మనవాడే, వాడిని దొర అని నువ్వు అనుకొంటున్నావు, వాడు పరాయి వాడు కాదు, రంగు తేడా కాని వాడు మనవాడే అన్నారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-12-2015 అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు ఒక అమ్మగారు చెపుతున్నారు మా అబ్బాయి తరచుగా నన్ను చూడటానికి రావటంలేదు అందుచేత నాకు దుఃఖం వస్తోంది అని చెబుతున్నారు. ఆ అమ్మగారికి ఏమని చెప్పాను అంటే మీ అబ్బాయిని మీరు ప్రేమించవచ్చు, దానికి అభ్యంతరంలేదు, కాని మీ అబ్బాయి పట్ల మీకు ఎంత ప్రేమ ఉందో అంత ప్రేమ మీ అబ్బాయికి మీపట్ల ఉండాలని వాంఛించకూడదు. అసలు ప్రేమించడు అని కాదు కొద్దిగా ఆప్యాయత ఉంటుంది. మీ అబ్బాయి మీద మీకు ఎంత ప్రేమ ఉందో అంత ప్రేమ వాడికి మీమీద ఉండదు. మరి మీ అబ్బాయికి అసలు ప్రేమ లేదా అంటే మీ అబ్బాయికి ప్రేమ ఉంది, వాడి సంతానాన్ని వాడు ప్రేమించుకొంటాడు. ఇది ప్రకృతి. ఇటువంటి విషయాల గురించి బెంగపెట్టుకోవటం, దుఃఖపడటం మనకి అనవసరం. మన డ్యూటీ ఏదో మనం చెయ్యాలి. ఎవరో మనలను చూస్తారు అని అనుకుంటే వారు మనల్ని చూడకపోతే మనకు దుఃఖం వస్తుంది. పాము

వస్తూ ఉంటే దానిని చంపటానికి అందరూ కర్రలు సిద్దం చేసుకొంటారు. అలాగే నీకు ఏదైనా కష్టాలు వస్తాయని నువ్వు ఊహించుకుంటే దానికి సంబంధించిన ఆయుధాలు సంపాదించుకొని చేతిలో పెట్టుకో అంతేగాని ఏడుస్తూ కూర్చోవద్దు. ఒకవేళ మీ అబ్బాయి నిన్ను చూడకపోతే నీ అంతట నువ్వు స్వతంత్రంగా నిలబడటానికి ప్రిపేర్‌అయ్యి ఉండు. దేనికి దుఃఖపడతావు. దుఃఖం అనేది ప్రత్యేకంగా ఏమీ లేదు, అది ఒక తలంపు మాత్రమే. ఫేస్ దెమ్ అండ్ ఎండ్ దెమ్. ఎవరైతే నిన్ను బాగా చూడాలని అనుకొన్నావో ఒకవేళ వారు నిన్ను చూడకపోతే వారు నన్ను చూడాలి, నన్ను చూడాలి అని అనుకోనక్కరలేదు. అటువంటి భావాలు ఉంటే వాటికి ముగింపు పలుకు. మా అబ్బాయి నన్ను చూడటంలేదు అంటే మీ అబ్బాయి నిన్ను చూడకపోతే నువ్వు స్వతంత్రంగా జీవించలేవా? నీ కాళ్ళమీద నువ్వు నిలబడలేవా? మనం రేష్‌గా ఉండకూడదు కాని బోల్డ్‌గా ఉండాలి. అంటే మనం మాటలో, చేతలో రేష్‌గా ఉండకూడదు, కామ్‌గా, కూల్‌గా ఉండాలి. హృదయంలో మటుకు ధైర్యంగా ఉండాలి. లోపల పిరికితనం ఉంటే పెద్ద కారణం లేకుండా రోజూ చనిపోతూ ఉంటారు. రోజూ ఏదో సమస్య పెట్టుకొని ఏడుస్తూ ఉంటారు. మనిషి అనేవాడు ఒకేసారి చనిపోతాడు కాని రోజూ చనిపోడు. నీకు లోపల భయం ఉంటే మటుకు రోజూ చనిపోతూనే ఉంటావు.

బేర్ ఇన్‌సల్ట్, బేర్ ఇంజురీ దటీజ్ ఆల్‌సో ఎ పార్ట్ ఆఫ్ సాధన అని చెపుతారు. కొంతమంది చిన్నమాట కూడా పడలేరు. అందుచేత వారికి మీరు ధైర్యం నేర్పాలి. అంతేగాని భయపడేవారిని ఇంకా భయపెట్టకూడదు. వారికి ధైర్యం నేర్పాలి. పరిస్థితులు మనం అనుకొన్నట్లుగా ఉండవచ్చు, ఉండకపోవచ్చు. మీ ఇంట్లో వారు ఎక్కడనుండి వచ్చారు అంటే ఎక్కడనుంచో, ఎక్కడ నుంచో వచ్చి వారి దేహం యొక్క డెస్టినీని బట్టి ఆ కుటుంబంలో ఉన్నారు అంతే. ప్రాణం పోయినప్పుడు ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు. మన శరీరం మరణించాక లోపలఉన్న సూక్ష్మశరీరం ఒంటరిగా ప్రయాణం చేస్తుంది కాబట్టి ఇప్పుడు జీవించి ఉండగా రోజుకు ఒక గంట సేపు అయినా ఒంటరిగా ఉండటం నేర్చుకోవటం మంచిది. మాకు ఒంటరితనం అవకాశంలేదు అని మీరు అనుకోవచ్చు. మీ చుట్టూ జనం ఉన్నా ఇంత జనం ఉన్నారు ఏమిటి అని కంగారుపడకండి. జనాలమధ్య ఉన్నా మీరు లోపల ఒంటరిగా ఉండటం నేర్చుకోండి. మీ మనస్సులో ఒంటరిగా ఉండటం నేర్చుకోండి.

మానవశరీరం రావటం, ముముక్షత్వం కలగటం, ముముక్షత్వానికి అనుగుణంగా మిమ్మల్ని గైడ్ చేయగల గురువు దొరకటం వీటికి మీ పూర్వపుణ్యం ఉండాలి, దైవానుగ్రహం లేకుండా ఇవి రావు. ఈ మూడు అవకాశాలు మీకు వస్తే భగవంతుని దయ మీపట్ల ఉందని మీరు అనుకోండి. మానవశరీరాలలో ఉండవచ్చు, పక్షులుగా జన్మించవచ్చు, జంతువులుగా జన్మించవచ్చు కాని లోపల జీవుడు ఒక్కడే. మీకు ఎంతోకొంత పూర్వపుణ్యం లేకపోతే మానవశరీరం రాదు. మానవశరీరం వచ్చింది అంటే మీకు పూర్వపుణ్యం ఉంది. ఇప్పుడు మనకు శరీరం వచ్చింది. ఇంక ఏ రకమైన శరీరం రాకుండా ఉండటానికి ఈ శరీరాన్ని ఉపయోగించుకోవాలి. మరణంలేనివస్తువుని మనం అనుభవైకవేద్యం చేసుకోవాలి అనేది మీకు గమ్యంగా మీ బ్రెయిన్‌లో అదే ఉండాలి. పూర్వజన్మలలో మీరు ఎంతోకొంత సత్కర్మ చేసి ఉంటే ముముక్షత్వం వస్తుంది కాని లేకపోతే ఆ జిజ్ఞాస రాదు. మిమ్మల్ని సరి అయిన మార్గంలో నడిపించటానికి, మీకు స్పిరిట్యువల్ స్టేటస్ కలుగజేయటానికి తగిన గురువు దొరకాలి, దానికి దైవానుగ్రహం ఉండాలి.

ఇక్కడ ఆచార్యులవారు చెప్పే విషయం మీరు అంగీకరించవచ్చు, అంగీకరించక పోవచ్చు. మీలోపలఉన్న సత్యవస్తువు మీకు జీవితంలో కొంత అనుభవంలోనికి వచ్చిన తరువాత కూడా ఇంకా కొన్ని వాసనలు మీలో ఉండవచ్చు అన్నారు. ఇక్కడ ఘర్షణ ఏమిటి అంటే మీలో కొన్ని వాసనలు మిగిలి ఉన్నప్పుడు సత్యవస్తువును ఎలా గ్రహించగలరు అనేటువంటి పేచీలు ఉన్నాయి. రామకృష్ణుడిని మనం అవతారపురుషుడు అంటున్నాము. అయినా ఆయన ఎప్పుడైనా జిలేబి తెమ్మని తినేవాడు. అది కోరిక కాదా అంటే కోరికే. అది బంధవాసనకాదు, భోగవాసన. అది పునర్జన్మకు దారితీసే వాసనకాదు. ఒకసారి వివేకానందుడు, ఇంకోస్వామి కలిసి వాకింగ్‌కు వెళుతున్నారు. స్వామీజీ ఏమన్నారు అంటే ఏమయ్యా వివేకానందస్వామి ఈ భూమి మీదకు వచ్చి ఏమిచేసాడు, వాడు సాధించింది ఏమిటి అన్నాడు. కూడా ఉన్న స్వామి ఏమీ మాట్లాడలేదు, మౌనంగా ఉన్నాడు. వివేకానందుడు ఏమి చేసాడు అంటే నువ్వు ఏమి మాట్లాడటంలేదు, మరి నీకేమి తెలుస్తుంది. వివేకానందుడు ఈ భూమి మీదకు వచ్చి ఏమి చేసాడో ఇంకో వివేకానందుడికి తెలుస్తుంది కాని నీకు తెలుస్తుందని నేను అనుకొంటానా? నీకు తెలియదే. నీకు తెలియనప్పుడు నువ్వు ఎలా

చెప్పగలవు అన్నాడు. ఈ మాటలు ఎలా ఉన్నాయి, అహంకారముతో మాట్లాడినట్లు ఉన్నాయి, ఏమో వాడి మనస్సులో ఏముందో? ఇక్కడ మీకు కర్తృత్వం కనిపిస్తోంది కదా! అది చూసి వివేకానంద జ్ఞాని ఏమిటి అని మీరు అనుకోవచ్చు. అలాగ మనం ఒక మనిషిని కొలువలేము. హి ఈజ్ ఎ వాయిస్ వితౌట్ ఫారమ్ అండ్ వితౌట్ నేమ్. వాడికి ఒక రూపం లేదు, ఒక పేరు కూడా లేదు. కాని వ్యవహారంలో పేరు ఉంది కాబట్టి ఆపేరు అంటున్నాడు. అయితే ఈ మాటలు చూస్తే ఆచార్యులవారు చెప్పింది నిజమే అని మనకు అనిపిస్తుంది.

మేము అది సాధించాము, మేము ఇది సాధించాము, కుటుంబసభ్యులను ఉద్ధరించాము, కష్టపడి సంపాదించాము, ఇప్పడు భోగం అనుభవిస్తున్నాము అంటారు. అంటే మనకు కర్తృత్వం ఉంది. మనకు కర్తృత్వం ఉందేమిటి అని ఛాదస్తంగా కూర్చోకుండా దానిని తొలగించుకోవడానికి ప్రయత్నం చేయండి. మీరు ఎస్కేప్ అవ్వవద్దు. దానిని ఫినిష్ చేయండి. ఫేస్ దెమ్ అండే ఫినిష్ దెమ్. మీకు ఏదైనా అనారోగ్యం వస్తే దానిని తొలగించుకోవటానికి ఎలా ప్రయత్నం చేస్తున్నారో అలాగే కర్తృత్వాన్ని తొలగించుకోవటానికి జాగ్రత్తగా సహనంతో ప్రయత్నం చేయండి. కర్తృత్వంలోనుండి నువ్వు బయటకు రాకపోతే నీకు స్వేచ్ఛ లేదు. మీకు ఫ్రీడమ్ లేనప్పడు మా అబ్బాయి మమ్మల్ని పలకరించటంలేదు ఇటువంటి గొడవలు వస్తాయి. పలకరించకపోతే మీకు కాలం కలిసి వస్తుంది కదా! కర్తృత్వం పోకపోతే నీకు ఫ్రీడమ్ లేదు, నువ్వు బంధంలో ఉండవలసిందే. మనం నేను, నాది అని ఎక్కువగా అంటాము. నాది అనేది నాది కాదని తెలియని మూలంగా మనం ఎక్కువగా నాది, నాది అని ఉపయోగిస్తాము. నాది అనే భావన ఉన్నప్పడు అక్కడ బంధం ఉంటుంది. ఇవన్నీ చైతన్యానికి సంబంధించిన విషయాలు కాదు, ఇవి రెండూ అనాత్మకు సంబంధించిన విషయాలు. నీది కానిది నీదికింద కనిపిస్తోంది. ఉన్నది బ్రహ్మమే, అదే నీకు లోకం కింద కనిపిస్తోంది. అందుచేత లోకం ఉందా లేదా అని భగవాన్‌ను అడిగితే లేదని ఎలా చెపుతాము కనిపిస్తోంది కదా అన్నారు. ఉంది అని చెప్పలేదు కనిపిస్తోంది కదా అన్నారు. అంటే బ్రహ్మమే నీకు ఇలా ప్రపంచం కింద కనిపిస్తోంది. అంటే జగత్తు, జీవుడు, దేవుడు వీటి అన్నింటికీ ఆధారంగా ఉన్నది బ్రహ్మమే. జగత్తుకు, జీవుడికి, దేవుడికి ఏ బ్రహ్మపదార్థం అయితే ఆధారంగా ఉందో అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు జగత్తులేదు, జీవుడులేడు, దేవుడు లేడు.

అంటే ఇవి అన్నీ ఏ సోర్సులోనుండి వచ్చి ఇలా కనిపిస్తున్నాయో అక్కడ అణిగిపోతే ఉన్నది ఒక్కటే, అదే ఇన్ని రకాలుగా కనిపిస్తోంది అనేటువంటి అనుభవం నీకు వస్తుంది.

మనం నేను, నేను అంటాము. ఈ నేను అనే సమస్యను పరిష్కారం చేయలేక పోతున్నాము. నేను ఉన్నప్పుడు నువ్వు ఉంటావు, నువ్వు ఉన్నప్పుడు వాడు అంటే దేవుడు ఉంటాడు. ఈ నేను ఎంతకాలం అయితే ఉందో అంతకాలం నీకు సృష్టి ఇలాగే ఉంటుంది, ఏవో గొడవలు వస్తూనే ఉంటాయి, రాగద్వేషాలు వస్తూనే ఉంటాయి. ఈ నేను పోతే నువ్వు లేవు, వాడూ లేడు. ఈ నేను అనేది నీ సొంతసమస్య. నీ సొంతసమస్యను పరిష్కారం చేసుకోవటానికి ప్రయత్నం చేయవా ఏమిటి? నువ్వు కానిదానితో జతకడుతున్నావు. నువ్వు కాని దేహంతో, నువ్వు కాని మనస్సుతో జతకడుతున్నావు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. అది నీవై ఉన్నావు. నీకు దాని తాలుక ఎరుకలేదు. దాని తాలుక ఎరుక నీకు కావాలి అంటే నువ్వు ఏదైతే కాదో అందులోనుండి విడిపోతేనే కాని దాని తాలుక ఎరుక నీకు రాదు. ఇక్కడ రాజీపడే అవకాశంలేదు. నువ్వుకానిదానిలో నుండి విడిపోతేనేకాని నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు ఎరుకలోనికి రాదు. ఏ వస్తువుకైతే మరణం లేదో దాని ఎరుక నీకు వచ్చేవరకు నువ్వు ఇలా చనిపోతూ ఉంటావు, పుడుతూ ఉంటావు. శరీరాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, ఈ ప్రవాహం ఆగదు. అందరికంటే మరి నువ్వంటేనే నీకు బాగా ఇష్టం. మరి నిన్ను నువ్వు ఎలా పోగొట్టుకొంటావు. నిన్ను నీవు పోగొట్టుకొంటేనేగాని ఆయన తెలియబడడు. అంటే బ్రహ్మానుభవం నీకు కలుగదు. ఇట్ ఈజ్ ది బిగ్గెస్ట్ ఫైట్.

బద్దిరాజు బద్దిరాజుగారు నరసాపురంలో ఇంజనీర్‌గా పనిచేసేవారు. ఒకసారి ఆయన మా ఇంటికి వచ్చారు. ఏదో పుస్తకం ఇవ్వండి అన్నారు. ఆ టైముకి 'నేను ఎవడను?' పుస్తకం నా చేతికి అందింది, ఆ పుస్తకం ఇచ్చాను. అది చదివితే ఆయనకు మతిపోయినట్లు అయ్యింది. ఆయనకు భక్తి ఇష్టం. అది నాకు తెలియదు. ఈ నేను ఎవడను ఏమిటి అనుకొన్నారు. తరువాత ఒకసారి ఆయన పెరవలి రోడ్డులో కనిపించి నాకు గొప్పపుస్తకం ఇచ్చారండి అన్నారు. భగవాన్ మీద ఇష్టంలేనట్లుగా మాట్లాడారు. ఆయనకు భగవాన్

నచ్చాలి అని ఎక్కడుంది? నేను ఆ సంఘటనను మరిచిపోయాను. తరువాత భగవాన్ నాకు స్వప్నంలో వచ్చి బద్దిరాజు గారిని చూపించి ఆయన ఎవడు అని అడిగారు. ఆయన ఎవడో నాకు తెలుసు. నీకూ నాకూ సంబంధం ఉంది. ఆయనకు నాకు సంబంధం ఉంది. నీకు ఆయనకు ఏమీ సంబంధం లేదు మరి ఆయన ఎవడు అని అడుగుతావు ఏమిటి? ఆయన గొడవ నీకెందుకు? అన్నాను. అప్పుడు భగవాన్ చెప్పారు "ఆయన నీవాడు అని చెప్పలేదు, నా వాడు అని చెప్పలేదు. వాడు మనవాడే అన్నారు. పూర్వజన్మలలో మనకీ, ఆయనకీ సంబంధం ఉంది, ఆయన మరిచిపోయాడు. ఆయన పరాయివాడు కాదు. నువ్వు ఆయనను పరాయివాడికింద చూడకు, మనవాడికిందే చూడు" అన్నారు. అంటే శరీరాలు మారినా, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మనలను విడిచిపెట్టేసినా గురువుతోటి అనుబంధం అలా జన్మజన్మలకు కంటిన్యూ అవుతుంది. దానిని మనం తెంపలేము. గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా ఒక్కటే. ఆయన స్వరూపాన్ని పొందేవరకు మనం ఎక్కడ ఉన్నా మనలను విడిచిపెట్టడు వాడే గురువు. వన్ టచ్ ఈజ్ ఎనఫ్, వన్ లుక్ ఈజ్ ఎనఫ్, వన్ వర్డ్ ఈజ్ ఎనఫ్. అందుచేతనే భగవాన్ మీటింగులకు వచ్చేవారితో జాగ్రత్తగా ఉండండి అని చెపుతున్నాను. మీరు సరదాగా వచ్చినా ఆయన పట్టుకొంటాడు. తీరా వలలో పడితే దాకలోకి వెళ్లిపోతుంది.

ఈ దేహాన్ని నేను, మనస్సు నేను అని దానితో నువ్వు తాదాత్మ్యం పొందుతున్నావు, ఇట్ ఈజ్ నాట్ కరెక్ట్. ప్రతీ మనిషికి వాడి అహంకారం అంటే వాడికి ఇష్టం. ఒకవేళ నీకు ఇష్టం ఉన్నా ఇట్ ఈజ్ నాట్ కరెక్ట్, ఇట్ ఈజ్ ద ఫాల్స్ ఐడియా. అది నిజంకాదు. అది నువ్వు కాదు. మీకు ఈగో ఉంది అనుకోండి, మీరు పారిపోవద్దు దానిని ఫేస్ చెయ్యండి. ఎస్కేప్ అయితే ఏమి వస్తుంది? అది ఉందని గ్రహించి దానికి ముగింపు పలకండి. లోకవాసన బలీయమైనది. లోకంలో ఏదో గౌరవం పొందాలి అని మీరు అనుకొంటే దానికి మించిన స్వార్థం ఏముంది? గౌరవంకోసం మీరు ఒక పని చేస్తే అది కూడా బంధమే. గౌరవం ఆశించి ఒక పనిచేస్తే నీకు స్వార్థం పెరుగుతుంది. ప్రపంచంలో ఇంతవరకు ఏ స్వార్థపరుడికి రీలైజేషన్ రాలేదు. మీరు అనాత్మతో ఎక్కువగా తాదాత్మ్యం పొందుతున్నారు. అంటే ప్రపంచానికి దగ్గరగా ఉంటున్నారు,

దేవుడికి దూరంగా ఉంటున్నారు. మీరు ఏదైతే అవునో దానికి దూరంగా ఉంటున్నారు, మీరు కానిదానికి దగ్గరగా ఉంటున్నారు. దానిని ఆపుచెయ్యండి, దానికి ముగింపు పలకండి. మీరు ఏదిగా ఉన్నారో దానికి దగ్గరగా ఉండటం నేర్చుకోండి. మీరు ప్రపంచానికి దగ్గరగా ఉంటూ లోపల ఉన్న సత్యానికి దగ్గరగా ఉన్నామని అలా అనుకోవద్దు. మీరు అలా నటించవద్దు, ఆ ఫాల్స్ ఐడియాని ముగింపు చేయండి.

పూర్వం అనేకమంది ఋషులు సత్యాన్ని దర్శించి వాళ్ళ అనుభవాన్ని మనకు చెప్పారు. వారు ఏమని చెప్పారు అంటే దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఇవి మూడు సంకెళ్ళు. ఈ మూడు గొలుసుల్ని తెంపుకోవటంచాలా కష్టం. ఇవి మన కళ్ళకు కనబడని సంకెళ్ళు, అవి మన బుద్ధికి అందవు. వాటిని తెంపుకొంటేనేగాని మనకు స్వరూపజ్ఞానం వచ్చే అవకాశంలేదు. ఈ మూడు జైళ్ళలో నుండి బయటకు రాకుండా నీకు ఫ్రీడమ్ ఎలా కలుగుతుంది. నువ్వు నిర్దాక్షిణ్యంగా ఈ మూడు వాసనలలో నుండి బయటకు రావటానికి సిన్సియర్‌గా ప్రయత్నం చెయ్యి. ఏమీ నటించవద్దు. మోక్షం పొందాలి అనే కాంక్ష కనుక నీకు బలీయంగా ఉంటే నీకున్న మిగతా అల్పమైన కోరికలు, చిన్న కోరికలు వాటంతట అవే నశించిపోతాయి. నీకు లౌకికమైన కోరికలు వందలాది కోరికలు ఉండవచ్చు, వాటిని పట్టించుకోవద్దు. ట్రూత్ రీలైజేషన్ పట్ల నీకు ఉన్న కాంక్ష నిజమైతే నీకు వేలాది కోరికలు ఉన్నా అవి అన్నీ కూడా కాలి బూడిద అయిపోతాయి. మీకు జిజ్ఞాస, ముముక్షత్వం ఇప్పుడు లేదు అనుకోండి, లేదు లేదు అని అనుకోవద్దు. ట్రూత్ గురించి వినండి. ట్రూత్‌కోసం మీరు ప్రాక్టీసు చేస్తూ ఉంటే మీకు తెలియకుండానే లోపల అభ్యాసం జరిగిపోతూ ఉంటుంది. ముందు కొంచెం కష్టంగా ఉంటుంది కాని అలవాటు అయితే మీకు తెలియకుండానే మీ మనస్సు సత్యం వైపుకు ప్రయాణం చేస్తూ ఉంటుంది. రీలైజేషన్ రాలేదు ఏమిటి అని కంగారు పడవద్దు, దానికోసం ఎదురు చూడవద్దు. నిన్ను ఎప్పుడు అనుగ్రహించాలి అనేది ఈశ్వరుడు చూసుకుంటాడు. నువ్వు అభ్యాసం విడిచిపెట్టవద్దు. ఎక్కడా విరామం లేకుండా దాని గురించే ఆలోచించాలి, దానినే స్మరించాలి. దానిని పొందాలి అనే కాంక్ష ఉండాలి. నది ప్రవహిస్తూ ఉంటుంది. మన వంక చూడమంటే చూడదు, ఆగమంటే ఆగదు. సముద్రంవైపుకు పరుగెత్తుతూ పోతుంది. సత్యాన్వేషణ పట్ల మీ ప్రయాణం నదీప్రవాహంలా

ఉండాలి. సత్యాన్వేషణలో ఇతర తలంపులకు నీ బ్రెయిన్‌లో అవకాశంలేదు. నది సముద్రం వైపుకు ప్రవహించే కొలది దాని పుట్టుచోటుకు దూరమవుతూ ఉంటుంది. అలాగే సత్యంవైపుకు మీరు ప్రయాణం చేసే కొలది అసత్యంకు దూరమవుతారు. మీరు ఏదైతే అవునో దానిని సమీపించే కొలది మీరు కానిదానికి మీరు దూరమవుతూ ఉంటారు.

నీకు బయటనుండి ఎక్కడినుండి అయినా సంతోషం వస్తూ ఉంటే దానిని తగ్గించుకో. నీ సుఖం కోసం, శాంతికోసం ఎవరిమీద ఆధారపడవద్దు, అలా ఆధారపడితే దుఃఖం వచ్చేస్తుంది. ఎక్కడ మనస్సు ఉందో అక్కడ డిస్ట్రబెన్స్ తప్పదు. నిన్ను నీవు తెలుసుకోవద్దని నీకు ఎవరైనా చెపుతున్నారా? ట్రూత్‌ను రీలైజ్ చేయటానికి ఎవరోనీకు అడ్డురావటంలేదు, నీ మనస్సే నీకు అడ్డువస్తోంది. నీకు కోరిక ఉంది కాబట్టి మనస్సు బాహ్యాముఖానికి వెళుతోంది. కోరిక లేకపోతే నీ మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళదు. బాహ్యాముఖంగా వెళుతున్న నీ మనస్సును ఆపుచేస్తే, అది అంతర్ముఖమవుతుంది, అప్పుడు అది హృదయం యొక్క లోయల్లోకి దిగి అక్కడ ఉన్న సత్యంలో ఐక్యమవుతుంది. అప్పుడు నీకు నిజమైన స్వేచ్ఛ కలుగుతుంది. మీ మైండ్ ఇప్పుడు బ్రెయిన్‌లో ఉంది. అప్రయత్నంగా మీ మైండ్ మీ బ్రెయిన్‌లో ఎంత సహజంగా ఉంటుందో అంత సహజంగా మీ మైండ్ స్పిరిట్యువల్ హార్ట్‌లో ఉండగలిగితే అది నశిస్తుంది, మనస్సుతో మీకు పేచీలు అక్కరలేదు, మనస్సు దానంతటదే చనిపోతుంది. అప్పుడు వాసనలు అన్నీ కాలిబూడిద అయిపోతాయి. నీకు మనోనాశనం ఎప్పుడైతే కలిగిందో అప్పుడు హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు వ్యక్తమవుతుంది. ఇప్పుడు నేను అనేటప్పటికి నీకు దేహం ఎలా స్ఫురిస్తోందో అప్పుడు నేను అనేటప్పటికి నీ హృదయంలో ఉన్న సత్యమైన నేను మీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. కష్టాలు చూసి పారిపోకండి. కర్రలు సిద్దం చేసుకొని ఫేస్ దెమ్. ముగింపు అయ్యేవరకు వాటితో పోరాడండి. ఫేస్ దెమ్ అండ్ ఎండ్ దెమ్. మీరు ఏమైనా మంచి పనులు చేస్తే ఎవరి కళ్ళకు కనబడకుండా, ఎవరి చెవులకూ వినబడకుండా చేసేయండి. క్వయిట్‌గా, కూల్‌గా చేయండి. ఏసు ఏమన్నాడు అంటే నీ కుడి చెయ్యి చేసే పని ఎడమ చెయ్యికి ఎందుకు తెలియాలి? జీవుడికి పబ్లిసిటీ కావాలి. పబ్లిసిటీ కోసం పనిచేస్తే పబ్లిసిటీ వస్తుంది కాని మోక్షం రాదు. వినండి, నేర్చుకోండి, స్మరించండి, తరించండి.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

మార్చి 7 శివరాత్రి - జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

## చిత్తశుద్ధి

చిత్తశుద్ధి లేని శివపూజలేలరా! అన్నారు యోగి వేమన. 'చిత్తశోధకం ముక్తి సాధకం' అన్నారు భగవాన్ శ్రీరమణులు. 'చిత్తశుద్ధి' అనే గేటు ద్వారానే మోక్షంలోనికి ప్రవేశించాలి అంటారు, సద్గురు శ్రీ నాన్నగారు. కర్మను యోగంగా చెయ్యడం వల్ల చిత్తశుద్ధికలుగుతుంది అంటారు శ్రీకృష్ణపరమాత్మ. మనస్సును శుద్ధి చేసుకోవడమే చిత్తశుద్ధి. మన మనస్సులోని దోషాలనుండి, ద్వంద్వాలనుండి విడుదల పొందుటయే చిత్తశుద్ధి. మనము చేసేపనిని నిష్కామంగా, అహంకార రహితంగా చేస్తూ, ద్వంద్వాలను సమానముగా స్వీకరిస్తే, మనస్సులోని దోషాలు నశించి, చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధిని ప్రసాదించమనే మనము గురువును కోరుకోవాలి. నిర్మల చిత్తమునకే మోక్షమని పేరు. సాధారణంగా మనము కర్మలను అహంభావన కేంద్రంగా, రాగద్వేష ప్రేరితులమై చేస్తూ, బంధంలో పడుతూ ఉంటాము. మనస్సులో గతస్మృతులు, భవిష్యత్తు గురించిన ఊహలు, వాసనలు ఇవన్నీ గూడుకట్టుకొని ఉంటాయి. అట్టి వాటినుండి మనస్సును విముక్తం చెయ్యాలంటే స్వరూపచింతన చెయ్యమంటారు భగవాన్. చిత్తశుద్ధి కలిగితే, మనస్సు అంతర్ముఖమై దాని మూలంలో కరిగిపోతుంది. మనను మనం బాగుచేసుకోవడానికి, పవిత్రులమవడానికి, ఈ మానవ జన్మ ఒక మంచి అవకాశం. దుఃఖము, అశాంతి, పునర్జన్మ కారణాలు, శరీరంలో లేవు, లోకంలో లేవు, అవి మనస్సులోనే ఉన్నాయి కాబట్టి, మనస్సు నశిస్తే దుఃఖం నశించి, వాస్తవంగా తానెవరో? అనుభవైక వేద్యం అవుతుంది. మనము కృత్రిమంగా కాకుండా సహజంగా జీవించాలి. ఎంత చిన్న పని అయినా చిత్తశుద్ధితో, ప్రేమతో, చెయ్యాలి. చేసే ప్రతిపని దేహాత్మబుద్ధి నుండి విడుదల చేసేదిగా ఉండాలి. శ్రద్ధతో, చిత్తశుద్ధితో ఏకొంచెం చేసినా అది పరమాత్మ ఆరాధనే అవుతుంది. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మను ఆచరిస్తే చిత్తశుద్ధి, అంతరదృష్టి కలిగి తద్వారా అమృతానుభవం కలుగుతుంది. చిత్తశుద్ధి లేకుండా బేధబుద్ధి నశించదు. చిత్తశుద్ధి లేకుండా మోక్షానుభవం కలుగదు. కాబట్టి చిత్తశుద్ధి కలవారే మానవాళికి ఆదర్శప్రాయులు.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# గురు స్థానం - శివ స్థానమే

మంచి పని చెయ్యబోయే ముందు శ్రీ గురుచరణాలను ధ్యానం చెయ్యాలి. ఇది సనాతన సాంప్రదాయం. ఆయన పాదాలలో సర్వతీర్థాలు ఉన్నాయి. ఆయన మొఖమే వేదం. దాన్ని చూస్తే అన్ని వేదాలు పారాయణం చేసినట్లే. ఆయన కళ్ళు అమృతమయాలు, ఆయన చూపు వల్ల యోగామృతం మనలో ప్రవేసిస్తుంది. పాదాలు మొదలుకొని శిరస్సు వరకూ ధ్యానం చేస్తే అన్ని విఘ్నాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయి. గురువు రూపాతీతుడు, కాలాతీతుడు, గుణాతీతుడు అనే భావన వారి కళ్ళలోకి చూస్తే నిజ భక్తుడు గ్రహిస్తాడు. మనలో పరిశుద్ధత పెరిగేకొద్దీ మన చిన్నచిన్న అర్చణలు ఆయనకు మరింత ఆనందం కలిగిస్తుంది. పూజలందుకొనే శక్తి గురువుకే ఉంటుంది. గురువుకన్న అధికమైనది ఏదీ లేదు ఇది శివుని శాసనము. కబీర్ "సద్గురువు సాయం చేసిననాడు, గుణాలు, ఇంద్రియములలో మదం అంతా పోతుంది. దేహంలో నామం వెలుగుతుంది. ఆపదలు అరచి, అరచి చస్తాయి" అన్నారు. ఉత్తమ సాధకులు సత్యాన్ని వారు నిజాయితీగా అన్వేషిస్తారు. గురువు వద్ద నుంచి చిన్న సంకేతం దొరికితే సరిపోతుంది. గురువు మన కళ్ళల్లోకి చూస్తే సరిపోతుంది. ఆయన మనవారైపోతారు. మనం వారి వారమైపోతాము. మనం గురువును గాఢంగా ప్రేమిస్తే ఆయన శరీరం కన్న భిన్నంగా పరమాత్మగా ఉంటారు. గురువు యొక్క చివరి ప్రయత్నం మనకు మధ్యవర్తులు లేకుండా భగవంతునికి ముఖాముఖి నిలవాలని వారి ఇచ్ఛ కర్తవ్యం. కాని అది అంతా తొలగిపోయే వరకూ మనముందు ఉంటాడు. తొలగిపోయిన తరువాత గురువు తనకు తానుగానే తొలగిపోతాడు. రామకృష్ణునికి తోతాపురి చేసే చివరి ప్రక్రియ ఇదే. "అప్పడు సృష్టి మొత్తం ప్రేమ స్వరూపమవుతుంది అని తెలుస్తుంది. అలాంటి ద్రవ్యాన్నే ప్రేమ అంటారు" పెద్దలు. "స్వామీ మిమ్ములను ధ్యానించే శక్తిని అనుగ్రహించండి" అని మన గురువును శక్తికొలది ప్రార్థన చేస్తే సర్వశక్తులు సంపాదించుకోవచ్చు. కుమ్మరివాడు కడవను చెయ్యటానికి తడి మట్టిని తట్టి తట్టి వంకర్లు తీర్చటానికి లోపలికి చెయ్యి ఊపుగా నిచ్చి పైన చేతితో కొడతాడు. అలాగే గురువు తన మండలిలోని శిష్యుల కర్మభారాన్ని ప్రారబ్ధంలోని సంకటాలను మన ముందు పడేసి మానసికంగా, శారీరకంగా అనుభవింపచేసి సుందరంగా, సుమధురంగా తీర్చిదిద్దుతాడు. మరి అలాంటి గురువుని సాధకుడు ఎలా గ్రహిస్తాడు అంటే ఆయన కళ్ళలో కాంతి, రూపం చుట్టూ అనంతమైన శాంతి, సమ్మోహకరమైన చిరునవ్వు అవ్యాజమైన ప్రేమ ఇలా ఎన్ని చెప్పినా అది జన్మజన్మల హృదయసాధనా ధర్మమే. అసలు కారణం రెండు వీణల శృతి ఒక్కటైతే నాదం తక్షణం కార్యోన్ముఖమవుతుంది. సజీవ సద్గురువు ద్వారా పూర్తి సహాయం అందుతుంది. ఈతరానివాడు నదిని దాటాలంటే నేర్పరియైన గురువు నీళ్ళలోకి దిగి అతన్ని కూడా తీసుకొని ఊపిరి బిగబెట్టటంలాంటి ప్రక్రియలను నేర్పుతాడు. అలాగే జీవుని ప్రాణప్రయాణ ప్రవాహమనే నదిని దాటటానికి ఆత్మ విద్య ద్వారా గురువు బోధిస్తాడు. అది మన గ్రహణశక్తి మీద ఆధారపడి ఉంటుంది. గురువును మనలోకి ప్రవేశింపచెయ్యాలి అప్పడు శాంతి తీరానికి చేరిపోతాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**